క్లుప్తంగా

ఆలయ గోపురానికి కలశాల సమర్పణ



గోపుర కలశాలను అందజేస్తున్న సరోజనమ్మ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి గురువారం పట్టణానికి చెందిన సరోజనమ్మ నాలుగు గోపుర కలశాలను సమర్పించారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, స్థపతి కుమార్, అర్చకులు అప్పాజీ శర్మ, మోహన్‌శర్మ, పాలకమండలి మాజీ సభ్యులు పీజీ చంద్రయ్య,శెట్టి, సెన్నీరు కుప్పం తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయానికి మందుల వితరణ



పాలకమండలి చైర్మన్‌కు మందులను అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నాయుడు పేటకు చెందిన దాత సురేష్ రూ.లక్ష విలువైన మందులను పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో రమేష్, సుబ్రహ్మణ్యం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంజి అంజి వినాయకునికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: సంకట చతుర్థి పురస్కరించుకుని గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకునికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఇటీవల ఈ పూజలను ఆర్జితసేవ గా పాలకమండలి నిర్ణయించడంతో భక్తులు పె ద్ద సంఖ్యలో పూజలకు హాజరయ్యారు. ఆలయ పండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్య క్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



కూలీలతో ఫ్లెక్సీలను తొలగిస్తున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక బస్టాండు వద్ద నున్న ఫ్లెక్సీలను గురువారం పోలీసులు తొలగించారు. బస్టాండుకు అడ్డంగా వీటిని ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని హెచ్చరించినా పట్టించుకోవడం లేదని ఎస్‌ఐ మంజునాథరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పర్యాయం ఎవరైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ ప్రసన్న, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కవోని దీక్షతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- సమష్టి కృషితో విజయవంతం చేద్దాం
- సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత
- స్థానికులకు 'ఆధార్'తో రూ.500 టిక్కెట్ రూ.200లకే!
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



హాజరైన పలుశాఖల అధికారులు

శ్రీకాళహస్తి: మొక్కవోని దీక్షతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి అందరూ సమష్టి కృషి చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆలయ పరిపాలన భవనంలో అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. శాఖల వారీగా చేయాల్సిన పనులు, విధులపై చర్చించారు. 16న శివదీక్ష స్వీకరించి సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. శివదీక్షతో వచ్చే భక్తులకు ప్రశాంతంగా దైవదర్శనం అయ్యేలా విధులు నిర్వర్తించాలన్నారు. పూల అలంకరణతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నామని, ఈ పర్యాయం లక్ష, 3లక్షలమంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. ఉత్సవాల నిర్వహణకు రూ.4కోట్లు వ్యయం అవచ్చని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ధూర్జటి కళాప్రాంగణం, శ్రీకాళహస్తి స్వర్ణముఖి నదీ తీరం, శివయ్య గోపురం పీవోపీ, ఫైబర్‌లతో కై లాసం సెట్టింగ్, శివపార్వతుల ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. లైటింగ్‌షో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. బాల్యవివాహాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం సమస్యలు ఉత్పన్నం కాకుండా పురపాలక శాఖ నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రమాదాల జరగకుండా అగ్నిమాపక శాఖ చూడడంతోపాటు గాలిగోపురం మీద పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించాలన్నారు. ఈసారి బందోబస్తుకు 700మంది పోలీసులను కేటాయించాలని ఎస్పీని కోరనున్నట్టు చెప్పారు. సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యత ఇవ్వాన్నారు. భ్రమరాంబ అనే సంస్థకు చెందిన మహిళలు 500 మంది రాష్ట్రం నలుమూలల నుంచి ఇక్కడ సేవ చేసేందుకు వస్తున్నారని, వారితో మర్యాదగా నడచుకోవాలన్నారు. స్థానిక భక్తులకు ముందు రోజు రూ.500 టిక్కెట్లు రూ.200కే కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు తీసుకెళితే వారికి టిక్కెట్లు మంజూరు చేస్తామన్నారు. చైర్మన్, బోర్డు సభ్యులు భక్తులకు క్రమబద్ధంగా సేవలందించాలన్నారు. చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే, అధికారుల, పాలక మండలి సహకారంతో మహాశివరాత్రి ఘనంగా నిర్వహిస్తామన్నారు.సమావేశంలో ఈవో సాగర్‌బాబు, డీస్పీ విశ్వనాథ్, కమిషనర్ బాలాజీనాయక్, సీడీపీఓ శాంతిదుర్గ, సీఐ అంజూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రా..రమ్మని!



కలెక్టర్ వెంకటరమణా రెడ్డికి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక ఇస్తున్న చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లిలో ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు సుమన్‌ను ఆహ్వానించారు. గురువారం ఆలయ ఈఓ రామచంద్రా రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు గురువారం తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయం, పుత్తూరులోని ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కళ్, ధర్మకర్తల మండలి సభ్యులు ఆనందుడు, ఎస్ఎం సురేష్, మునివేలు, అజయ్‌కుమార్, ప్రత్యేక ఆహ్వానితులు రాధాక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు వైద్య పరీక్షలు



గర్భవతిని పరీక్షిస్తున్న వైద్యాధికారిణి మాధవి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం వైద్యాధికారిణి మాధవి గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గర్భం దాల్చిన మహిళలు ఏఎన్ఎం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని, క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకుని రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు మందులను వాడాలన్నారు. ఆసుపత్రిలో కాన్పు అయితే జననీ సురక్ష కింద రూ.1000, వైఎస్ఆర్ ఆసరా పథకంలో రూ. 4000 నగదు ఉచితంగా ఇస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం రాత్రి తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర సెక్రటరీకి సన్మానం

సత్యవేడు: ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా రెండవసారి ఎం.చెంచులయ్య ఎన్నికైన సందర్భంగా స్థానిక ఉద్యోగులు ఆయన్ను సన్మానించారు. గురువారం ఆర్టీసీ గ్యారేజీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ వెంకటేశ్వర్లు, అధ్యక్షులు యుగంధర్, గ్యారేజీ అధ్యక్షుడు నరేష్, సెక్రటరీ శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, కో-ఆపరేటివ్ డెలిగేట్ సురేష్, నేతలు పార్థసారథి, గోపాల్ పాల్గొన్నారు.

గోవులకు దాణా

శ్రీకాళహస్తి: మాఘమాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ స్థానికుడు దేవస్థాన గోశాలలో స్థానికులు సుబ్బారావు గోమాతలకు పండ్లు, దాణా వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ, గోమాత ప్రకృతి స్వరూపమన్నారు. గోవులను పరిరక్షించిన చోట ధర్మం వర్ధిల్లుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూళ్లకు స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులు



మాదనపాళెం స్కూల్‌కు స్మార్ట్‌బోర్డు అందజేస్తున్న ఇషిహార

- శ్రీసిటీ టీహెచ్‌కే ఇండియా పరిశ్రమ వితరణ
- రూ. 16 లక్షల విలువైన 12 బోర్డులు

సత్యవేడు: ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సామాజిక సేవల్లో భాగంగా శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని టీహెచ్‌కే ఇండియా పరిశ్రమ మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులను వితరణ చేసింది. గురువారం మాదనపాళెం ఉన్నత పాఠశాలకు 2, చెరివి ప్రాథమికోన్నత పాఠశాలకు1, ఇరుగుళం ఉన్నత పాఠశాలకు 5 బోర్డులను కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ షుసాకు ఇషిహార ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. షుసాకు ఇషిహార మాట్లాడుతూ, అభ్యసన, బోధనలో సాంకేతికత వినియోగంతో ప్రాథమిక విద్యాబోధన విధానంలో మంచి మార్పులు వస్తాయన్నారు. ఇందుకుగాను స్మార్ట్ బోర్డులను సమర్థవంతంగా వాడుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు టీహెచ్‌కే పరిశ్రమ సహకారాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. విద్యలో సాంకేతికత ఎంత ప్రముఖ పాత్ర పోషిస్తుందో ముఖ్యంగా కోవిడ్ సమయంలో అందరూ చూశామన్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ కార్యకలాపాల్లో విద్య ఒక ప్రధాన అంశమని, పరిశ్రమలతో కలసి పరిసర ప్రభుత్వ ఉన్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధుల కింద కంపెనీ మొత్తం రూ.16 లక్షలతో 12 స్మార్ట్ బోర్డులను వితరణ చేసింది. ప్రస్తుతం మూడు స్కూళ్లకు 8 బోర్డులు పంపిణీ చేసింది.

విలు విద్య పోటీల్లో వైష్ణవికి రజతం



వైష్ణవియాదవ్‌ను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన వైష్ణవియాదవ్ రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో సత్తా చాటింది. పట్టణంలోని పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు నిర్వహించారు. స్థానిక చైతన్య పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వైష్ణవియాదవ్ రెండవస్థానంలో నిలిచింది. నిర్వాహకులు రజత పతకం, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గురువారం ఆమెను పలువురు అభినందించారు.

ఎమ్మెల్యే నివాళి.. పరామర్శ



తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి తండ్రి చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట: మండలంలోని తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి తండ్రి ఎస్. గంగిరెడ్డి ఇటీవల మృతి చెందడంతో గురువారం తూకివాకంలో కర్మక్రియలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హాజరై నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయనతోపాటు నియోజక వర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, ఎంపీపీ హరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మల్లం రవిచంద్రారెడ్డి, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఏర్పేడు : మండలంలోని బాలకృష్ణాపురంలో మృతుని కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మొద్దు మునిరామయ్య తండ్రి మొద్దు మునెయ్య (74) మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జమ్మల శ్రీనివాసులు, సర్పంచ్ జయముని, వైఎస్సార్ సీపీ నాయకుడు దామోదరం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను రూపుమాపుదాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: బాల్య వివాహాలను రూపు మాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం బాల్యవివాహాల వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. చిన్నతనంలోనే వివాహం చేస్తే మానసికంగా, శారీరకంగా బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. 2007 జనవరి 19న పార్లమెంటులో బాల్యవివాహాల నిర్మూలనకు కఠిన చట్టం చేశారన్నారు. ప్రజాసంఘాలు, అధికారులు గ్రామాల్లో పర్యటించి బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో చందమామల కోటయ్య, ఎం.శ్రీనివాసులు, మోహన్, శ్రీనివాసులు, కృష్ణవేణి, గంగ, గౌరి, వసంతరావు, వెంకటేష్, మునెమ్మ, గోపి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని ఏఎస్ఐ ఉష అన్నారు. గురువారం ఆమందూరులో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో బాల్యవివాహాలు చేయకుండా కట్టడి చేయాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేస్తే కాన్పు కష్టమై మాతా, శిశు మరణాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. అంతేకాకుండా బాల్యవివాహాలు చేస్తే రూ.లక్ష జరిమానా విధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, ప్రగతి సంస్థ మండల కన్వీనర్ శిరీష, పంచాయతీ కార్యదర్శి మునికృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులు



సీఐ అజయ్‌కుమార్

శ్రీకాళహస్తి రూరల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, వాటి నిర్మూలనకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13నుంచి నిర్వహించనున్న శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో బాల్యవివాహాలు చేయకుండా ఉండేందుకు సదస్సుల నిర్వహణకు పూనుకుంటున్నట్టు చెప్పారు. అలాగే సచివాలయం పరిధిలోని మహిళా పోలీసులను కూడా ఇందులో భాగస్వామ్యం చేస్తామన్నారు. చదువుకోవాల్సిన వయస్సులో కొంత మంది బాలికల తల్లితండ్రులు బాల్యవివాహాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బాల్యవివాహాలకు స్వస్తి పలికి ప్రతి ఒక్కరూ తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని విజ్ఞప్తి చేశారు. 18 ఏళ్లు నిండిన తర్వాత బాలికలకు, 21 ఏళ్లు నిండిన తర్వాత యువకులకు వివాహం చేయాలన్నారు. బాల్యవివాహాలు ఎక్కడైనా చేస్తున్న పక్షంలో వెంటనే అధికారుల దృష్టికి తేవాలని కోరారు. బాలికలను ఎవరైనా వేధిస్తే పోలీస్ హెల్ప్‌లైన్ 100కుగానీ, తమకుగానీ సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే పేకాట, కోడి పందాలు నిర్వహిస్తుంటే 9440900722 సెల్ నంబర్‌కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆకట్టుకున్న నాణేల ప్రదర్శన



నాణేలను ప్రదర్శిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజశేఖర్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన నాణేల సేకరణకర్త విజయనగరం విజయకుమార్ 2వేల ఏళ్ల నాటి నాణేలను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇండో-గ్రీకులు, ఇక్ష్వాకులు, శాతవాహనులు, గుప్తులు, చోళులు, ఉజ్జయిని రాజులు, బ్రిటీష్ ఇండియా నాణేలను ప్రదర్శించినట్లు తెలిపారు. చరిత్రను, ఆనాటి సంస్కృతిని కూడా నాణేలు తెలియజేస్తాయన్నారు. అనంతరం నాణేల సేకరణకర్త ను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సావిత్రి, సుజాత, క్రాంతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు

గడప గడపకు..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలం కాసారం సచివాలయ పరిధిలోని కాసారం కొత్త దళితవాడ, కొండ్రాజుపల్లె, అరుంధతివాడ, గొట్టిపూడి ఎస్టీ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిర్వహిస్తారని మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు.

మండల సమావేశం

సత్యవేడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బాలగణేశ్ తెలిపారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరవుతారని, మండల స్థాయి అధికారులు తమ శాఖల సమాచారంతో హాజరు కావాలని కోరారు.